

ఇవాళ్టి సంక్షోభానికి కారణం సుప్రీంకోర్టేనని మొదట అర్థం చేసుకోవడం అవసరం. సర్దార్ సరోవర్ డ్యాం మీద ఎన్‌బిఏ సుప్రీం కోర్టులో వేసిన కేసుపైన 2000 సంవత్సరంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులోనే దాని మూలం వుంది. ఆ తీర్పును ఇప్పుడు సుప్రీంకోర్టు తిరగదోడజాలదు కాబట్టి ఈరోజు ఎన్‌బిఏ చేస్తున్న ఫిర్యాదుకు సంతృప్తికరమైన పరిష్కారం చూపించడం సుప్రీంకోర్టుకు కష్టం.

# నర్మదా ఆందోళనను సుప్రీంకోర్టు పరిష్కరించగలదా?

ఈసారి నర్మదా బచావ్ ఆందోళన్ (ఎన్.బి.ఏ) నాయకురాలు మేధాపాట్కర్ చేపట్టిన నిరాహార దీక్ష ప్రముఖ వార్త అయింది. ఆమె ఎందుకోసం ఆ నిరాహారదీక్ష చేపట్టిందో కూడా దేశానికి కొంతమేరకు అర్థం అయింది. నిర్వాసితుల పునరావాసం సమగ్రంగా చేపట్టకుండానే నర్మదా డ్యాం ఎత్తు పెంచుతున్నారనీ, పునరావాసం సమగ్రంగా చేపట్టేదాకా దానిని ఆపాలని ఆమె డిమాండ్ చేస్తోందనీ చాలామంది అర్థం చేసుకున్నారు. సుప్రీంకోర్టు ఒకవైపు డ్యాం ఎత్తు పెంచే పని కొనసాగించమని చెప్తూ, ఇంకొకవైపు పునరావాసం పని కూడా వేగంగా జరగాలని ఆదేశించడం ద్వారా ఆమె నిరాహార దీక్ష వల్ల తలెత్తిన సంక్షోభాన్ని తాత్కాలికంగా పరిష్కరించిందనీ, మే నెల మొదటివారంలో సుప్రీంకోర్టు కొనసాగించబోయే విచారణ తుది పరిష్కారం ఇవ్వగలదనీ కూడా చాలామంది నమ్ముతున్నారు.

కొంచెం వెనక్కిపోయి విషయాన్ని అర్థం చేసుకుంటే తప్ప ఈ సమస్య గురించి సమగ్రమైన అవగాహన ఏర్పడదు. అది ఏర్పడనిదే రేపు సుప్రీంకోర్టు చేయగల పరిష్కారానికి వుండే పరిమితులు అర్థం కావు. అర్థం కానిదే రేపు మళ్ళీ ఎన్.బి.ఏ. ఆందోళన మొదలుపెడితే అందులోని న్యాయాన్యాయాలు అవగాహన కావు.

ఇవాళ్టి సంక్షోభానికి కారణం సుప్రీంకోర్టేనని మొదట అర్థం చేసుకోవడం అవసరం. సర్దార్ సరోవర్ డ్యాం మీద ఎన్‌బిఏ సుప్రీంకోర్టులో వేసిన కేసుపైన 2000 సంవత్సరంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులోనే దాని మూలం వుంది. ఆ తీర్పును ఇప్పుడు సుప్రీంకోర్టు తిరగదోడజాలదు కాబట్టి ఈరోజు ఎన్‌బిఏ చేస్తున్న ఫిర్యాదుకు సంతృప్తికరమైన పరిష్కారం చూపించడం సుప్రీంకోర్టుకు కష్టం.

## 2000 సంవత్సరంలో సుప్రీంకోర్టు ఏమనింది?

నర్మదా నది మధ్యభారతంలోని కొండలలో పుట్టి పడమటికి ప్రవహించి అరేబియా సముద్రంలో కలుస్తుంది. ఇది మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్‌ల భూభాగంలో ప్రవహిస్తుంది. ఈ నదిపైన ఆ మూడు రాష్ట్రాలూ నిర్మించదలచిన డ్యాంలు 30 పెద్దవి, 135 మధ్యతరహావి. సర్దార్ సరోవర్ వీటన్నిటిలోకీ పెద్దది. అది ఉండేది గుజరాత్‌లో, దానివల్ల ఫలితం పొందేదీ పూర్తిగా గుజరాతే. కానీ మునిగేది మాత్రం అత్యధికంగా మధ్యప్రదేశ్‌లోని ఆదివాసీ ప్రాంతం.

ఈ సర్దార్ సరోవర్ డ్యాంనే సవాలుచేస్తూ 1994లో ఎన్‌బిఏ సుప్రీంకోర్టులో కేసు వేసింది. అసలు ఆ డ్యాంను చేపట్టడమే చట్టవిరుద్ధమని వాదించింది. మొదట్లో డ్యాం నిర్మాణంపైన స్టే ఇచ్చినప్పటికీ, 2000 సంవత్సరంలో ఆ కేసులో తుదితీర్పు ఇచ్చిన సుప్రీంకోర్టు ఎన్‌బిఏ వాదనలన్నిటినీ కొట్టేసి డ్యాం కట్టుకొమ్మని గుజరాత్‌కు అనుమతి ఇచ్చింది. ఆ కేసులో జరిగిన వాదోపవాదాలన్నిటినీ ఇప్పుడు ప్రస్తావించడం అనవసరం. పునరావాసం గురించి సుప్రీంకోర్టు ఆనాడు ఏం చెప్పిందన్నదే మనకు ప్రస్తుతం.

డ్యాంకు అనుమతి ఇస్తేనే కదా పునరావాసం ప్రసక్తి వచ్చేది. కాబట్టి ఆ కేసు వాదనలో పునరావాసం చర్చ ప్రధానం కాదు. అయినప్పటికీ అన్ని వాదనలతోపాటు పునరావాసం గురించి కూడా వాదన చేయడం జరిగింది. సుప్రీంకోర్టు ఈ విషయంలో స్పష్టమైన వైఖరి ప్రదర్శించింది. అదేమిటో తెలుసుకోవడం ప్రస్తుత సంక్షోభాన్ని అర్థం చేసుకోవడానికి అవసరం – ఎందుకంటే దీనికి కారణం ఆ వైఖరే కాబట్టి.

నర్మదా నదిపైన మూడు రాష్ట్రాలూ పెద్దఎత్తున ప్రాజెక్టులు తలపెట్టాయని పైన చెప్పుకున్నాం. ఎగువన వున్న మధ్యప్రదేశ్ తలపెట్టిన డ్యాంల వల్ల దిగువన ఉన్న తాము తలపెట్టిన సర్దార్ సరోవర్‌కు నష్టం రాగలదని గుజరాత్ వివాదం లేవదీయగా, కేంద్ర ప్రభుత్వం 1968లో నర్మదా జల వివాదాల ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేసింది. ఆ ట్రిబ్యునల్ 1978లో తన అవార్డు ప్రకటించింది. ఆ అవార్డులో, నర్మదా నదిపైన ప్రాజెక్టు నిర్మించే ఏ రాష్ట్ర ప్రభుత్వమైనా రిజర్వాయర్ వల్ల ముంపుకు గురయ్యే నిర్వాసితులకు పునరావాసం కల్పించాలనీ, కోల్పోయిన భూమికి బదులుగా భూమి ఇవ్వాలనీ చెప్పింది.

ట్రిబ్యునల్ పునరావాసం విషయంలో ప్రకటించిన ఈ ఆదేశం అమలయ్యేటట్టు చూసేంతవరకే తన కర్తవ్యం తప్ప పునరావాసం గురించి తనను అదనంగా ఏమీ అడగొద్దనీ, అడిగితే ఇవ్వబోయేది లేదని కూడా 2000 సంవత్సరంలో ఇచ్చిన తీర్పులో సుప్రీంకోర్టు స్పష్టంగా ప్రకటించింది. ఉదాహరణకు – నిర్వాసితులు అత్యధికంగా ఆదివాసులు కాబట్టి, ఉమ్మడి జీవితం వారి మనుగడకు ముఖ్యం కాబట్టి, నిర్వాసిత గ్రామానికి గ్రామంగానే వేరొకచోట పునరావాసం కల్పించాలని ఎన్‌బిఏ వాదించగా, 'అట్లాగని నర్మదా జలాల ట్రిబ్యునల్ అనలేదే' అనింది సుప్రీంకోర్టు. 'పునరావాసం ఇమ్మన్నదిగానీ ఒకేచోట ఇమ్మనలేదు కాబట్టి మీకు ఆ హక్కు లేదు' అనింది. అట్లాగే, రిజర్వాయర్ కింద భూములు కోల్పోయిన వారికిచ్చినట్టే కాలవల కింద భూములు కోల్పోయిన వారికి కూడా పునరావాసం ఇవ్వాలని ఎన్‌బిఏ వాదించగా, 'ట్రిబ్యునల్ అట్లా అనలేదే' అనింది సుప్రీంకోర్టు. 'రిజర్వాయర్ కింద భూమి కోల్పోయే వారికి భూమికి భూమి ప్రాతిపదికన పునరావాసం ఇమ్మని ట్రిబ్యునల్ చెప్పిందే తప్ప కాలవల కింద భూములు కోల్పోయిన వారికి కూడా ఇవ్వాలని ట్రిబ్యునల్ అనలేదు కాబట్టి మీకు ఆ హక్కు లేదు' అనింది.

సుప్రీంకోర్టు అనుసరించిన ఈ తర్కం హాస్యాస్పదమైనది. నదీ జలాల ట్రిబ్యునల్ అవార్డు పరీవాహక రాష్ట్రాలకు శిరోధార్యం తప్ప సుప్రీంకోర్టుకది శిరోధార్యం కాదు. అవార్డు అన్యాయంగా ఉందని సుప్రీంకోర్టు భావిస్తే దానిని రద్దు చేయవచ్చు. అసమగ్రంగా ఉంటే సమగ్రత కల్పించవచ్చు, లేదా సమగ్రత కల్పించమని ట్రిబ్యునల్‌ను ఆదేశించవచ్చు. దేశంలోని అన్ని న్యాయ నిర్ణయ వ్యవస్థల మీద పర్యవేక్షక అధికారం సుప్రీంకోర్టుకు ఉందని రాజ్యాంగంలోని ఆర్టికల్ 136 అంటోంది. అటువంటప్పుడు 'నదీ జలాల ట్రిబ్యునల్ ఇచ్చిన అవార్డును దాటి పునరావాసం గురించి మేమేమీ చెప్పము'అనేది అర్థరహితమైన అభిప్రాయం. ఆర్టికల్ 136 గురించి సుప్రీంకోర్టు జడ్జిలకు తెలియదనుకోలేము కాబట్టి ఇది అజ్ఞానం నుండి పుట్టిన అభిప్రాయం కాదనీ, ఉద్దేశ్యపూర్వకంగా తీసుకున్న నిర్ణయమనీ అర్థం అవుతుంది.

చివరిగా ఎన్‌బిఏ తరఫు న్యాయవాది సుప్రీంకోర్టును ఒకటి కోరాడు. ఎట్లాగూ డ్యాం కట్టుకొమ్మంటున్నారు. ట్రిబ్యునల్ ఇమ్మన్నమేరకు పునరావాసం ఇమ్మంటున్నారు. అయితే ఒకసారి డ్యాం కట్టేస్తే ఇంక పునరావాసం ఇచ్చేది ఉండదు కాబట్టి, ఒక్కొక్క దశలోనూ డ్యాం ఎత్తు పెంచే ముందు పెంచబోయే ఎత్తువల్ల నిర్వాసితులు కాబోయే వారికి పునరావాసం పూర్తిగా కల్పించిన తరువాతే ఎత్తు పెంచేటట్లు ఆదేశించమని అడిగాడు. సుప్రీంకోర్టు ఒప్పుకోలేదు. డ్యాం నిర్మాణం, పునరావాసం సమాంతరంగా సాగుతాయనింది. పోనీ పునరావాసం నిజంగా సమాంతరంగా జరుగుతున్నదా లేదా చూడటానికి ఒక స్వతంత్ర వ్యవస్థను ఏర్పాటుచేయమని అడిగితే, దానికి కూడా సుప్రీంకోర్టు ఒప్పుకోలేదు. మూడు రాష్ట్రాలూ సహాయ పునరావాస సంఘాలు ఏర్పాటు చేశాయి కదా, ఆ ఉపసంఘాలు ఒకే అంటే చాలుననింది. అవి ప్రభుత్వం ఏర్పాటుచేసిన సంస్థలయినంత మాత్రాన వాటి విశ్వసనీయతను శంకించనవసరం లేదనింది. అంతేకాక, పునరావాసం అందని నిర్వాసితుల ఫిర్యాదులు వినడానికి మూడు రాష్ట్రాలూ ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగాలు నెలకొల్పాయి, వాటిని కూడా ఉపసంఘాలు సంప్రదిస్తాయి లెమ్మని అనింది.

ఈ అభిప్రాయమే ఇవాళ్టి సంక్షోభానికి మూలం. పునరావాస ప్రక్రియ ఏమాత్రం సంతృప్తికరంగా లేకున్నప్పటికీ సహాయ పునరావాస ఉపసంఘం డ్యాం ఎత్తు పెంపుకు అనుమతి ఇచ్చేస్తున్నదని ఎన్‌బిఏ ఆరోపణ. ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగం ఏ ఫిర్యాదులనూ పరిష్కరించడం లేదని ఇంకొక ఆరోపణ. ఇవి రెండూ నిజమేనని మేధాపాట్కర్ నిరాహారదీక్ష మొదలుపెట్టిన తరువాత ఆ ప్రాంతానికి పోయి పరిశీలించిన కేంద్ర మంత్రుల బృందం ధృవీకరించింది. ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగం బాధిత ప్రాంతాలను సందర్శించి 6 సంవత్సరాలయిందని కేంద్ర మంత్రుల బృందం అనింది. కేంద్ర జలవనరుల శాఖమంత్రి, సాంఘిక సంక్షేమ శాఖమంత్రి సభ్యులుగా వున్న ఈ బృందం ఎన్‌బిఏ చేసిన ఆరోపణ న్యాయమైనదేనని ఇంత స్పష్టంగా చెప్పినప్పటికీ డ్యాం ఎత్తు పెంపును సుప్రీంకోర్టు స్టే చేయడానికి నిరాకరించి 'ఎత్తు పెంచుకోండి, అయితే పునరావాసమూ వేగంగా చేయండి' అని చెప్తూ కేసును మే నెలకు వాయిదా వేయడానికి కారణం, 2000 సంవత్సరంలో ఇచ్చిన తీర్పులో తీసుకున్న వైఖరే. సమగ్రమైన పునరావాసం డ్యాం ఎత్తు పెంపుకు ముందుషరతు కాదు. దేనికది 'సమాంతరంగా' సాగుతుంటాయి. 'సమాంతరం' అనే మాటకు ఈ సందర్భంలో స్పష్టమైన అర్థమేమీ లేదు కాబట్టి ఆచరణలో దీని అర్థం ఇవి రెండూ విడివిడి విషయాలని. పునరావాసం సరిగ్గా చేపడుతున్నారా లేదా పర్యవేక్షించి డ్యాం ఎత్తు పెంపుకు గ్రీన్ సిగ్నల్ ఇయ్యవలసిన మూడు రాష్ట్రాల సహాయ పునరావాస ఉపసంఘాలు, వారు సంప్రదించవలసిన ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగమూ తమ డ్యూటీ సక్రమంగా చేయని పక్షంలో సుప్రీంకోర్టు (మన దినపత్రికల భాషలో) 'కొరడా ఝుళిపిస్తుంది'. ఆ ఝుళిపింపులకు ఆయా సంఘాలూ యంత్రాంగాలూ బెదరకపోతే నిర్వాసితులు చేయగలిగిందేమీ లేదు.

ఇక్కడ సమస్య సుప్రీంకోర్టు సీరియస్‌గా స్పందిస్తుందా లేదా అన్నది కాదు. నిజంగానే పునరావాస ప్రక్రియ డ్యాం నిర్మాణ ప్రక్రియ అంత చురుగ్గా సాగాలన్న సంకల్పం సుప్రీంకోర్టుకు వున్నా, సాగుతున్నదని ఒకరూ, సాగడం లేదని ఒకరూ అంటున్నప్పుడు నిజమేమిటో దైనందిన ప్రాతిపదికన తేల్చి చక్కదిద్దడం ఢిల్లీలో కూర్చున్న న్యాయస్థానానికి సాధ్యంకాదు. అందుకే ఈ పర్యవేక్షణ చేయడానికి ఒక స్వతంత్ర యంత్రాంగాన్ని నియమించమని 2000 సంవత్సరంలో చివరి కోరికగా ఎన్‌బిఏ తన వాదనలలో కోరింది. అటువంటి యంత్రాంగం ఊరూరా తిరిగి నిజమేమిటో తేల్చగలిగేది. కానీ 'ప్రభుత్వం నియమించిన ఉపసంఘాల విశ్వసనీయతను శంకించనక్కరలేదు' అంటూ ఆ వాదనను తోసిపుచ్చిన కోర్టు, అది నిజమేనని ఇప్పుడు కేంద్ర జలవనరుల మంత్రి, సాంఘిక సంక్షేమ మంత్రి స్వయంగా చెప్పిన తరువాత తానే కొరడా చేతబట్టుకుంటానని ప్రకటించినా అది ఆచరణయోగ్యమైన పరిష్కారం కాబోదు.

ప్రస్తుత సంక్షోభానికి మే నెలలో ఏదో ఒకరకంగా తెరపడినా, ఈ సమస్య మళ్ళీ మళ్ళీ ముందుకు రాబోతుంది. నర్మదా డ్యాం ప్రతిపాదిత ఎత్తు 136 మీటర్లు. ఇప్పుడు వారు అనుమతి అడుగుతున్నది 112 మీటర్ల ఎత్తుకు పెంచడానికి. అంటే ఇంకా 24 మీటర్లు పెంచబోతారు. అది రెండు విడతలలో చేస్తారో మూడు విడతలలో చేస్తారో తెలీదు. కాబట్టి ఇంక రెండుసార్లో మూడుసార్లో రాబోయే సంవత్సరాలలో ఇదే సంక్షోభం రాగలదు. అప్పటికింకా ఒంట్లో ఓపిక ఉంటే మేధాపాట్కర్ మళ్ళీ నిరాహారదీక్షకు కూర్చోవచ్చు. లేదా ఇంకెవరైనా కూర్చోవచ్చు. సజావుగా మాత్రం డ్యాం నిర్మాణం, పునరావాసం జరిగిపోవు.

నిజాయితీగా స్పందించదలచుకుంటే సుప్రీంకోర్టు 2000 సంవత్సరం నాటి తీర్పును పునస్సమీక్షించాలి. దానికి న్యాయమూర్తులు సిద్ధమేనా?

28 ఏప్రిల్ 2006
హైదరాబాద్

మానవ హక్కుల వేదిక
Human Rights Forum (HRF)